క్లుప్తంగా

వారే.. రోడ్డును బాగు చేసుకున్నారు..


రోడ్డు బాగు చేస్తున్న గ్రామస్తులు

కరకగూడెం: వరదలకు కోతకు గురైన రోడ్డును బాగుచేసుకోడానికి మండలంలోని కొలూరు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు కదిలారు. తమ సమస్యను తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకుని శుక్రవారం శ్రమదానం చేసి రోడ్డు బాగుచేసుకున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామానికి వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో పెద్ద గుంతలు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో, గ్రామస్తులే రంగంలోకి దిగి తాటి మొద్దులను అడ్డుగా పెట్టి, వరద నీటిని పొలాల్లోకి పారించి రోడ్డు బాగుచేసుకున్నారు. భవిష్యత్‌లో అధికారులు ఇలాంటి సమస్యలపై తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయాల్లో బోర్లు..


ఆలయంలో బోరు వేస్తున్న దృశ్యం

అశ్వాపురం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో మండల పరిధిలోని గొంది గూడెం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, నాగరాజు గుడిలో శుక్రవారం తాగునీటి బోర్లు వేశారు. ఆలయాల్లో తాగునీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారని ఆలయ కమిటీ, గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే తన నిధులతో బోర్లు వేయించారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి మధు, పర్శిక తిరుపతయ్య, జనార్ధన్, కృష్ణమూర్తి, పూజారి గొంది గోపాల కృష్ణ, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

చర్ల: అనారోగ్యం బారిన పడి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబానికి మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన మైపా సీలయ్య పక్షవాతంతో బాధపడుతుండగా కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.7 వేల నగదును చైర్మన్ నీలి ప్రకాశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దొడ్డి సూరిబాబు, పంజారాజు, కవ్వాల రాము, దొడ్డా ప్రభుదాసు, గాదె రాజు ప్రసాద్, మడిపల్లి ప్రవీణ్, దొడ్డి రామ్మోహన్, జట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల మానవహారం


నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ కార్యాలయం నుండి ప్లకార్డులు పట్టుకుని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అధ్యక్షులు, కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షన్ పెరుగుదల నిరోధక చట్టాన్ని రద్దు చేయాలన్నారు. అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ఎంవిఎస్ నారాయణ, ఉపాధ్యక్షులు చంద్ర సుబ్బయ్య, ఎస్.రాజబాబు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎల్‌వీ ప్రసాద్, కోశాధికారి కృష్ణమూర్తి, పొట్టబత్తుల సత్యనారాయణ, బాలస్వామి పాల్గొన్నారు.

నివాళి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు పంచాయతీ మాజీ సర్పంచ్, సీపీఎం నాయకులు వూకే వీరాస్వామి(84) అనారోగ్యంతో మృతిచెందగా పలువురు నాయకులు శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, కొక్కెరపాటి పుల్లయ్య, పిట్టల అర్జున్, చిరంజీవి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


వీరాస్వామి(ఫైల్)



గ్రామసింహాలు.. గర్జిస్తున్నాయి..

భద్రాచలంలో వీధికుక్కల స్వైరవిహారం

- ఈ ఏడాదిలో 2,096 మందికి కుక్కకాటు
- వెంట పడుతూ మరీ దాడులు
- కనీస చర్యలు తీసుకోని అధికారులు


భద్రాచలంలోని ఓ వీధిలో సంచరిస్తున్న కుక్కలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అన్ని కాలనీల్లో గ్రామసింహాలు గర్జిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల వెంట కుక్కలు స్వైరవిహారం చేస్తూ చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా దాడులు చేస్తున్నాయి. తాజాగా జూలై 21 ఒక్క రోజే పట్టణంలోని బ్రిడ్జిసెంటర్‌లో, రెవెన్యూ కాలనీ, అశోక్‌నగర్ కాలనీకి చెందిన ముగ్గురిని కరిచి గాయపర్చాయి. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కల బారి నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

ఏడునెలల వ్యవధిలో 2,036 మందిపై..

పట్టణంలో వివిధ కాలనీల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 2,096 మందిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. పట్టణంలోని అన్ని కాలనీల్లోని ప్రజలు పనుల నిమిత్తం బయటకు వచ్చిన సమయంలో ఈ వీధి కుక్కలు వారి వెంట పడుతున్నాయని, ఈ క్రమంలోనే అవి దాడి చేస్తున్నాయని, అదే విధంగా పట్టణంలోని వాహనాలు నడుపుతున్న వారి వెంట లేదా కార్లను వెంబడిస్తున్నాయి. వాహనదారులను వెంబడిస్తూ ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నాయి. ఇలా పలువురు వాహనదారులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించట్లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కలను గుర్తించి వాటికి ఆపరేషన్లు చేయించి, నియంత్రించాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యం వద్దు



కుక్క కరిస్తే వెంటనే ఆ భాగాన్ని సబ్బుతో 10 నుంచి 15 నిమిషాల గోరువెచ్చని నోటితో శుభ్రం చేయాలి. గాయంపై కట్టు, మట్టి, పసుపు, ఆకుపసరు వంటివి రాయకూడదు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి యాంటీ రేబిస్‌వ్యాక్సిన్ వేయించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికి ప్రమాదం.
– డా.రవీంద్రనాథ్ ఠాగూర్, ఇన్‌చార్జ్ ఏడీసీ, భద్రాచలం

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో నెలకొన్న వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు గాను ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే ఈ సమస్యపై పలు వినతిపత్రాలు అందాయి. వీధి కుక్కల సంఖ్య ఎక్కువ ఉన్న ప్రాంతాలలో ఉన్న ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
– సీహెచ్.శ్రీనివాస్, పంచాయతీ ఈవో, భద్రాచలం

నియంత్రణ, అప్రమత్తతే ముఖ్యం..

పెంపుడు కుక్కలతో పాటు వీధికుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్‌లు చేయడానికి అవకాశాలున్నాయి. భద్రాచలం పట్టణంలో 2,500 పైగానే వీధికుక్కలుండగా పెంపుడు కుక్కల సుమారు 1,700 వరకు ఉంటాయి. వీటిలో పెంపుడు వాటికి జనన నియంత్రణ ఆపరేషన్లు చేశారో లేదో తెలియదు కానీ, పట్టణంలో ఉన్న ఏ ఒక్క వీధి కుక్కకు మాత్రం ఆపరేషన్ చేయించలేదు. ఆపరేషనయిన కుక్కలు కరవడం కూడా చాలా తక్కువ. పెంపుడు కుక్కలకు కూడా విధిగా శస్త్ర చికిత్సలు చేయించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ తన నివేదికలో 75 శాతం వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేయడం వల్ల ఆ ప్రాంతాన్ని రేబిస్ రహితంగా మార్చవచ్చని సూచించింది. వీటికి మూడు నెలల వయస్సులో తప్పనిసరిగా టీకాలతో పాటు ప్రతీ ఏటా బూస్టర్ డోస్ వేయించాలి. అప్పుడే వాటి వల్ల ప్రజలకు ప్రమాదం ఉండదు. అదేవిధంగా కుక్కలు దాడికి గురికాకుండా ఎప్పటికప్పు అప్రమత్తంగా ఉండాలి. ఒక వేళ కుక్క కరిస్తే వెంటనే ప్రథమ చికిత్స చేసుకుని ఆస్పత్రికి వెళ్లాలి.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి


అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న సాబీర్‌పాషా


ములకలపల్లి: యాత్రలో నాయకులు

అశ్వారావుపేటరూరల్: కోట్లాది రూపాయల ఖర్చుతో జిల్లాలో సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నప్పటికీ, జిల్లాకు తీరని అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అశ్వారావుపేటలో శని, ఆదివారం పార్టీ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల్లో అశ్వారావుపేటలో హార్టికల్చర్ యూనివర్సిటీ, ఆర్‌డీవో, డీఎస్పీ కార్యాలయాలతోపాటు ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయడంతో మరో 38 అంశాలపై చర్చించి తీర్మానిస్తామని వెల్లడించారు. నాయకులు ఎస్‌డీ.సలీం, గన్నిన రామకృష్ణ, ప్రసాద్, రాహుల్, విజయ్, రిజ్వి, సాయి, అజిత్ పాల్గొన్నారు.

ములకలపల్లి: అశ్వారావుపేటలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్ అన్నారు. సభ విజయవంతాన్ని కోరుతూ మణుగూరులో ప్రారంభించిన అమరవీరుల స్మారక జ్యోతియాత్ర రెండరోజున శుక్రవారం ములకలపల్లికి చేరింది. ఈ మేరకు నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. మండల సహాయ కార్యదర్శి నరాటి రమేశ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉమ్మగాని హరీష్, సహాయ కార్యదర్శి జాకిర్, వెంకట్, చంద్రగిరి, ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పవన్ సాయి, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమావేశం


సమావేశంలో చర్చిస్తున్న అధికారులు, నాయకులు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని జీఎం కార్యాలయ సమావేశ మందిరం ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఏరియా ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) నాయకులతో శుక్రవారం పలు సమస్యలపై ఏరియా లెవల్ స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ నాయకులు ఏరియాలోని నెలకొన్న సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అంబేడ్కర్ పార్క్ వద్ద 33 కేవీ లైన్ గార్డింగ్ అందించాలని, ఉద్యోగులకు గమ్ షూస్ ఇవ్వాలని, మ్యాన్‌వేను మెయిన్ ఎంట్రెన్స్‌కు మార్చాలని కోరారు. ఈ సమావేశంలో అధికారులు శ్రీనివాసచారి, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, సిహెచ్ రాంబాబు, ఎస్.రమేష్, ఎం.అనురాధ, డాక్టర్ జ్యోతిర్మయి, మధన్ నాయక్, శివప్రసాద్, బైరెడ్డి వెంకటేశ్వర్లు, నాగరమేష్, మధుబాబు, శోభన్ బాబు, శ్రీనివాస్, రామేశ్వరరావు, వత్సవాయి కృష్ణంరాజు, గట్టయ్య, రాములు పాల్గొన్నారు.

‘మహాలక్ష్మి’తో దెబ్బతిన్న జీవనోపాధి


మణుగూరు టౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు, డ్రైవర్లు

మణుగూరు టౌన్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో వారి జీవనోపాధి దెబ్బతిందని, వెంటనే పథకాన్ని సడలించాలని డిమాండ్ చేస్తూ ఆటోడ్రైవర్లు, మ్యాజిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొన్ని బస్సులు 10–15 సర్వీసులు పెంచడంతో రోజుకు రూ.200 కూడా రాని పరిస్థితి నెలకొందని, ఆటోడ్రైవర్లకు రూ.12వేల భృతి తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రమాద బీమా ప్రభుత్వమే కట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఆటో డ్రైవర్లకు ప్రాముఖ్యతనివ్వాలన్నారు. అనంతరం ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పినపాక, కరకగూడెం, అశ్వాపురం మండలాల ఆటో డ్రైవర్లు, మ్యాజిక్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కరకగూడెంలో..

కరకగూడెం: మహాలక్ష్మి పథకంతో తమ జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో పలువురు ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు కొమరం సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఏదైనా ఆర్థికసాయం అందించి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. రంజిత్ కుమార్, సౌందర్య, అనిల్, లక్ష్మీనారాయణ, అక్తర్ ఉన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పండువారిగూడెం గ్రామంలో నాబార్డు సహకారం, వాసన్ పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరం, పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కొర్రి మల్లయ్య, మాలెం భీమరాజు, రాములమ్మ, డీపీఎంవో మోహన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లారీలతో వంతెన ధ్వంసం

చర్ల: భద్రాచలం వెంకటాపురం మార్గంలో వర్షాకాలం పూర్తయ్యేంత వరకు ఇసుక లారీలను నియంత్రించకుంటే మండలంలోని తేగడ సమీపంలో గల తాలిపేరు హైలెవల వంతెన ధ్వంసమవ్వడం ఖాయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు. తేగడలోని తాలిపేరు హైలెవల్ వంతెనకు రెండు వైపులా ఉన్నా అప్రోచ్ రోడ్ కుంగడంతోపాటు వంతెనపై పడిన గుంతలను శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్లకు మరమ్మతులు చేయించడంతో పాటు వర్షాకాలం పూర్తయ్యేంత వరకు ఇసుక లారీలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

చర్ల: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ పోరాటయోధుడు కొమరంబీం విగ్రహాన్ని ఆవిష్కరించనుండగా అందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ కరపత్రాలను విడుదల చేశారు. మండలంలోని సుబ్బంపేటలో జరిగిన సమావేశంలో ఈ కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన అనాంతరం మాట్లాడారు. నాయకులు వాసం ముసలయ్య, కుర్సం రాంబాబు, పూనెం వరప్రసాద్, ఇర్పా ప్రకాశ్, రమేష్, కనితి లక్ష్మయ్య ఉన్నారు.

ఆత్మగౌరవ ఉద్యమాన్ని బలపరచాలి

చర్ల: సర్వ సమానత్వం కోసం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆత్మగౌరవ ఉద్యమాన్ని బహుజనులంతా బలపరచాలని పార్టీ మండల అధ్యక్షుడు కొండా చరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బహుజనులంతా ఒక్కతాటిపైకి వస్తే రాజ్యాధికారం బహుజనుల చేతిలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం పార్టీలో చేరిన ఆవుల అన్నపూర్ణకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు గోగికార్ రామలక్ష్మణ్, మండల కార్యదర్శి సామల ప్రవీణ కోశాధికారి చెన్నం మోహన్‌రావు, ఈసీ మెంబర్ గుర్రాల విజయ్‌కుమార్, ఉప్పరిగూడెం సెక్టార్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.జహీరుద్దీన్ బాషా, నాయకులు సందీప్, వర్మ తదితరులు ఉన్నారు.

పేదల కలలు సాకారం చేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులతో పేదల కలలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతువేదికలో శుక్రవారం 216 మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, 25 మందికి కల్యాణలక్ష్మి, 16 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు విడతల వారీగా వస్తాయని అది నిరంతర ప్రక్రియని ఎవరూ అధైర్యపడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, సీడీపీఓ రేవతి, ఎంపీఓ ముత్యాలరావు, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దిన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సాహసోపేతమైన నిర్ణయాలతో అర్హులందరికీ పథకాలు అందిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గుట్టమల్లారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తహసీల్దార్ అద్దంకి నరేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అనంతరం రేషన్‌డీలర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, నాయకులు నవీన్, శివ, తరుణ్‌రెడ్డి, సతీష్, సౌజన్య, కూచిపూడి బాబు, కుర్రం రవి, గాండ్ల సురేశ్, అబ్దుల్లా, రహీం, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


మణుగూరు టౌన్: రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అర్హులందరికీ రేషన్‌కార్డులు


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ మధు

చండ్రుగొండ: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ఆర్డీఓ మధు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతి చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిన తర్వాత భూ సమస్యల పరిష్కారం చూపుతామన్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు


ధర్నా చేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని తురుబాక గ్రామంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. తూరుబాక దగ్గర కల్వర్టు కుంగిపోవడంతో రాకపోకలు సాగించేందుకు తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి ఇసుక లారీ దిగబడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయాన్ని తెలుసుకున్న ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట నాయకులు బొల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు నడపొద్దని ధర్నా..

మండలంలోని తూరుబాక గ్రామంలోని డైవర్షన్ రోడ్డు దగ్గర ఇసుక లారీలు నడపొద్దని శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డైవర్షన్ రోడ్డు వర్షానికి చిత్తడిగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని, అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు వెళ్లే పరిస్థితి కూడా లేదని తక్షణమే ఇసుక లారీల ప్రయాణం నిలిపివేయాలన్నారు. విషయం తెలుసుకున్న సీఐ అశోక్ ఆందోళనకారులతో మాట్లాడి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి పృథ్వీ, నిమ్మగడ్డ శ్రీనివాస్, చంచల కృష్ణ, తణుకు సాగర్, సాగర్, వాగే వెంకటేశ్వరరావు, భూక్య చందు, బానోతు నగేష్, జక్కుల శరత్, మోతుకూరి సాయిబాబు, మోతుకూరి వినోద్, గుమ్మడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్న ప్రస్తుత తరుణంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు సూచించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు, ల్యాబ్‌ను, ఫార్మసీని తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఏ డాక్టర్ స్పందన, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీసాహితి, డాక్టర్ జయ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సైదులు

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


కాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని అశోక్ నగర్ కొత్త కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు అన్నారు. సీపీఎం 14 వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ పట్టణ సీపీఎం బృందం సమస్యలపై పర్యటించింది. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దోమల మందు పిచికారీ చేయాలని, బ్లీచింగ్ చల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, సంతోష్ కుమార్, సీతాలక్ష్మి, నాదెళ్ల లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

‘అందని ద్రాక్షలా ఇందిరమ్మ ఇళ్లు’

చర్ల: మండలంలో ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అందని ద్రాక్షలా మారాయని సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పార్టీ నాయకులు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన పేదలను గుర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టి, తాగునీటిని సరఫరా చేయాలన్నారు. నాయకులు బందుల చంటి, పొడుపుగంటి సమ్మక్క, నవీన్, పామారు బాలాజీ, షారోను, వరలక్ష్మి పాల్గొన్నారు.


కొత్తపల్లిలో..

భక్తిశ్రద్ధలతో ‘శ్రావణ’ పూజలు

అశ్వారావుపేటరూరల్: శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం, తిరుమలకుంటతోపాటు పలు గ్రామాల్లో, అలాగే అశ్వారావుపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారితోపాటు అష్టలక్ష్మీ దేవతల విగ్రహాలను పూలతో అలంకరించి కుంకుమ పూజలతోపాటు పలు రకాల పూజలు చేశారు. అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


పూజలు చేస్తున్న మహిళలు